

ఖానాపూర్ : మాట్లాడుతున్న ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

## రజతోత్సవంతో సత్తా చాటుదాం

బీఆర్ఎస్ సభకు భారీగా తరలివెళ్లి సక్సెస్ చేద్దాం..

- ప్రతి కార్యకర్తకు అండగా గులాబీ పార్టీ ఉంటుంది..
- ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్
- క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం

ఖానాపూర్, ఏప్రిల్ 9 : బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 వసంతాలు పూర్తి కానున్న నేపథ్యంలో బుధవారం ఖానాపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు భారీగా తరలివెళ్లి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ఆగమాగం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వద్దు బీఆర్ఎస్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు వివరించారు. ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న రజతోత్సవ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజగంగన్న, రాజు, రాంనాయక్, భరత్, జానుబాయి, జైవంత్‌రావు, రాజరాంరెడ్డి, ఖలీల్ పాల్గొన్నారు.

### నిర్మల్ నుంచి భారీ సంఖ్యలో వెళ్తాం..

సోన్, ఏప్రిల్ 9 : ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నిర్మల్, సోన్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చూడాలని బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో గల పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అదే విధంగా బీఆర్ఎస్ జెండా గద్దెలను నిర్మించాలని, పల్లె పల్లెల్లో గులాబీ జెండా ఎగుర వేయాలన్నారు. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రజతోత్సవ సభను చరిత్రలో నిలిపిపోయేలా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహిస్తుండడంతో గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా చూడాలన్నారు. నిర్మల్, లక్ష్మణచాంద, మామడ మండలాల కన్వీనర్లు మహేశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



సోన్ కొండాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న రాంకిషన్‌రెడ్డి

## ‘మెస్సేజ్ యువర్ ఎస్పీ’కి ఫిర్యాదు చేయండి

- మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం..
- సంప్రదించాల్సిన వాట్సాప్ నంబర్ 87126 59973

ఎదులాపురం, ఏప్రిల్ 9 : నేరుగా ఫిర్యాదు చేయలేనివారు, సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు వాట్సాప్ మెస్సేజ్ రూపంలో ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ ఫోన్ వినియోగం అందుబాటులోకి రావడం వల్ల, అధికారులను సులువుగా సంప్రదించాలని వినూత్న ఆలోచనతో ‘మెస్సేజ్ యువర్ ఎస్పీ’ పేరిట నూతన కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎవరైనా అసాంఘిక, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం వాట్సాప్ ద్వారా అందించవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణనే ధ్యేయంగా జిల్లావాసులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించాలని ఈ ‘మెస్సేజ్ యువర్ ఎస్పీ’ కార్యక్రమం పని చేస్తుందన్నారు. ఈ సమాచారాన్ని అందించవలసిన పద్ధతి మీ పేరు, మీ వాట్సాప్ ద్వారా జిల్లా పోలీసు వాట్సాప్ నంబర్ 8712659973 కు సంప్రదించాలని తెలియజేశారు. సమస్యలపై పూర్తి వివరాలను రాసి వాట్సాప్ చేయాలన్నారు.



నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారి నచ్చన్ ఎల్లాపూర్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు



నీళ్లు లేక ఎండిపోయిన కాలువ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకర్, ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి

# సాగునీటి కోసం రైతన్న రణం



ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడుతున్న రైతు

### నీళ్లిచ్చే వరకు పోరాటం చేస్తాం..



సదర్మాట్ ఆయకట్టు చివరి భూములకు నీటిని విడుదల చేయకపోతే అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తాం. అధికారులు స్పష్టమైన హామీ ఇస్తేనే సాగు చేసినం. పంటలు చేతి కొచ్చే సమయంలో నీటిని విడుదల నిలిపివేస్తే మా పరిస్థితి ఏంటీ? స్వయంగా కలెక్టర్ మద్దిపడగ గ్రామానికి వచ్చి చివరి వరకు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. సదర్మాట్ అధికారులు మాత్రం మా రైతులను కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మే 10వ తేదీ వరకు నీటిని ఇవ్వాలి. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయంలో ఎదుట అధిక సంఖ్యలో రైతులతో ఆందోళన చేపడతాం.

- కమ్మల స్వామి, రైతు, లింగాపూర్

### వారబందన్నారు.. నిలిపి వేశారు..



సదర్మాట్ కింద దాదాపు 13 వేల ఎకరాలు సాగు చేసినం. పంట చివరి వరకు నీటిని ఇస్తామని చెప్పిన అధికారులు రెండు వారాల క్రితమే కాలువను మూసివేశారు. ఈ నీటి విడుదల కోసం అనేక సార్లు అధికారులను కలిసినం. అయినప్పటికీ నీటి విడుదల విషయంలో సతాయిస్తున్నరు. బంగారం తాకట్టు పెట్టి సాగు చేసినం. పంటలు చేతికొచ్చే సమయంలో ఇలా నీటి విడుదలను నిలిపివేస్తే మా పరిస్థితి ఏంటీ. నీళ్లు విడుదల చేయకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం. అధికారులు ఇప్పటికైన స్పందించి మా పంటలకు నీరివ్వాలి.

-గుగ్లావత్ రాములు, రైతు, మద్దిపడగ


## నిర్మల్ -మంచిర్యాల రహదారిపై రాస్తారోకో

- ఇరువైపులా గంటపాటు నిలిచిన వాహనాలు
- పది గ్రామాల నుంచి 300 మంది రైతుల రాక
- చివరి ఆయకట్టుకు నీరవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- ఎమ్మెల్యే బొజ్జు హామీ ఇచ్చిన వినని అన్నదాతలు
- తహసీల్దార్ నీరందిస్తామని చెప్పడంతో ఆందోళన విరమణ

కడెం, ఏప్రిల్ 9 : సదర్మాట్ ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఆందోళన బాట పట్టారు. దాదాపు లింగాపూర్, మల్లన్నపేట, ఎలగడప, దిల్దార్‌నగర్, మాసాయిపేట, నచ్చన్‌ఎల్లాపూర్, పెత్తార్పు, మద్దిపడగ, లక్ష్మీసాగర్, సారంగాపూర్ గ్రామాలకు చెందిన దాదాపు 300కు పైగా రైతులు తరలివచ్చి రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోతో నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రైతులను ఆందోళన విరమింప జేసే ప్రయత్నం చేశారు. తహసీల్దార్ ప్రభాకర్, కలెక్టర్ అభిలాష అభినవ్ వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఊరుకునేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. తహసీల్దార్ ప్రభాకర్‌కు కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ రైతులతో, సదర్మాట్ ఆయకట్టు అధికారులతో మాట్లాడారు. అయితే రాస్తారోకో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్ రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, ధర్నాలు, రాస్తారోకోలు చేయడం సరికాదని అన్నారు. దీంతో మీరు అందుబాటులో ఉండడం లేదని, నియోజకవర్గ కేంద్రం ఖానాపూర్ అయినప్పటికీ ఉట్నూర్‌కే పరిమితం అయ్యారని, తమ గోడు విన్నవించుకునే వారమని రైతులు సమాధానం ఇచ్చారు. అధికారులతో మాట్లాడి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఫోన్ కట్ చేశారు. కలెక్టర్ వచ్చే వరకు ఇక్కడే ఉంటామని కూర్చున్నారు. దీంతో తహసీల్దార్ ప్రభాకర్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దాదాపు గంట పాటు సాగిన రాస్తారోకో తహసీల్దార్ హామీతో విరమించారు. నీటి విడుదల విషయంలో జాప్యం చేస్తే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని, తహసీల్దార్ హామీతోనే విరమిస్తున్నామని చెప్పారు.

### మే 10వ తేదీ వరకు నీటిని అందించాలి..

జనవరి 2వ తేదీన అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో సమావేశం నిర్వహించారని రైతులు తెలిపారు. రైతులకు చివరి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామని, నిరభ్యతంతరంగా సాగు చేసుకోవాలని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టి మరీ సాగు చేశారని తెలిపారు. అయితే వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు వేశాక వారబందీ పద్ధతిన నీటిని అందిస్తామన్నారు. ఏప్రిల్ 9వ తేదీన కాలువను మూసివేస్తామన్న అధికారులు పది రోజుల ముందుగానే మూసివేశారని తెలిపారు. పంటలు చివరి దశలో ఉండగా, నీటి విడుదలను నిలిపివేస్తే తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు దాదాపు మూడు నుంచి నాలుగు తడులు కావాల్సి ఉంటుందని, ఈ సమయంలో నీటి విడుదల నిలిపివేస్తే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. మే 10వ తేదీ వరకు నీటిని అందించాలని, లేకపోతే 13 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే దుస్థితి ఉందని వాపోయారు.



బోథ్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## పోషకాహారం అందించేందుకే పోషణ పక్షం

- కలెక్టర్ రాజర్షి షా



పోషణ పక్షం గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఏప్రిల్ 9 : ప్రతి ఒక్కరికీ సంపూర్ణ పోషకాహారం అందించే దిశగా పోషణ పక్షం–2025 పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోషణ పక్షంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పక్షం రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో షెడ్యూల్ ప్రకారం రోజువారీగా నిర్వహించాలన్నారు. అనంతరం పోషణ్ పక్షం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో మిల్కా పాల్గొన్నారు.



ఎదులాపురం : గ్యాస్‌బుడ్డితో నిరసన తెలుపుతున్న మహిళలు, సీపీఎం పార్టీ నాయకులు

# గ్యాస్ మంట

- సిలిండర్ ధరను తగ్గించాలని బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు
- బుడ్డీలతో ఆందోళనలు.. వినతిపత్రాల అందజేత..

ఎదులాపురం/బోథ్/నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 9 : కేంద్రంలోని బీజేపీ సర్కారు పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళనలు చేశారు. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్ పట్టణాల్లో గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ గ్యాస్‌బుడ్డితో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు మంజుల, నాయకులు ఆశన్న, నగేశ్, అరిఫా బేగం పాల్గొన్నారు.

### సీపీఐ ఆధ్వర్యంలో..

కేంద్రం ప్రభుత్వం ప్రజలపై భారం వేసేలా గ్యాస్ ధరలు పెంచుతుందని సీపీఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ బుధవారం పార్టీ కార్యాలయం ఎదుట రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఖాళీ సిలిండర్ పెట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నళినిరెడ్డి, కుంటాల రాములు, అమీన పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత

గ్యాస్ సిలిండర్ ధరను ధరను తగ్గించాలని కోరుతూ బుధవారం బోథ్ బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతి పత్రం అందజేశారు. కేంద్రం బడా వ్యాపారులకు మేలు చేకూర్చే విధంగా పేదల కడుపు కొడుతూ సిలిండర్ ధర పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, చిల్కూరి వెంకటరమణ, మడావి భీంరావ్ పాల్గొన్నారు.

### నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట

గ్యాస్‌పై పెంచిన రూ.50లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్‌తో నిరసన చేపట్టారు. జిల్లా నాయకులు దుర్గం నూతన్ కుమార్ మాట్లాడుతూ.. పెంచిన ధరతో పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫసీయోద్దీన్, పోశెట్టి, శంభు, తిరుపతి, మురళి పాల్గొన్నారు.



నిర్మల్ అర్బన్ : గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న నాయకులు